భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# కథ

# జాజి పూలు

గోటేటి లలితా శేఖర్

ఎప్పటి సాయంత్రంలానే బాల్కనీలోకి చేరి అతని రాకను గమనించాను. స్కూటర్ ఇంటిముందు పార్క్ చేశాడు. స్కూటర్ బాక్స్‌తెరచి ఏవో పుస్తకాలు ఇతర వస్తువులు బయటకు తీసి ఇంట్లో కెళ్ళేముందు తలెత్తి నావేపు చూశాడు రోజులానే.

ఆకళ్ళలో 'వచ్చావా?' అన్న పలకరింపు. విచ్చీవిచ్చని చిరునవ్వు ఆపెదవులమీద తారట్లాడింది. వెంటనే తలదించుకుని వడివడిగా ఇంట్లోకి నడిచిపోతాడు.

మరొక అరగంట నేనలాగే బాల్కనీలో నిలబడి ఆ ఇంటిని చూస్తుంటాను మరొక దృశ్యం కోసం ఎదురు చూస్తూ.

విరజాజిపూల భాష మొదలైంది. సన్నని మధుర పరిమళం నెమ్మదిగా పరిసరాలను అలముకుంటోంది. గాలికి వూగుతున్న జాజితీగలు. గుత్తులుగా విచ్చుతున్న పూలతల్లులు కళ్ళువిచ్చి వినీలాకాశంలోకి చూస్తున్నాయి. నిన్న పూసిన పూలు గాలివాటుకు నెమ్మదిగా చిన్నచిన్న నక్షత్రాల్లా నేలరాలుతున్నాయి. శ్రావణ మేఘాలు అమృత ధారలను మూట కట్టుకుని అడిగిన వాళ్ళకు అడగనివాళ్ళకు పంచిపెట్టే ఆతురతలో అటూ ఇటూ కదిలిపోతున్నాయి

అరగంటపైనే అయింది అతను ఇంకా బయటకు రాలేదేంటి? .... అనుకుంటుండగానే అతను వచ్చాడు స్నానం చేసి ఫ్రెష్‌గా..... స్కూటర్ ముందుకు పోనిచ్చాడు.

× × ×

యవ్వనానికి పూలకు మరింత విడదీయరాని సంబంధమేదో వుంది. నేను కళ్ళు తెరిచిన నాటికే పూ బాలలు నన్ను విస్మయపరిచినా, పూల ఆత్మ, పూల బాసలు అర్థమయ్యేది, అనుభూతమయ్యేది యవ్వనంలోనే అనుకుంటాను. పదహారేళ్ళపడుచు అందానికి కురుల్లోనూ, మనసులోనూ అందాల్ని నింపి జీవితం ఒక్కొక్కరేకగా విప్పారుతున్న దశలో పూలు నన్ను పున్నాగులుగా, పోగడలుగా, మల్లెలుగా మరువాలుగా మురిపించి వలపించేవి. అప్పుడే అవి నాకు మనుష్యుల్ని ప్రేమించడం నేర్పాయి. సౌందర్యపు ప్రపంచంలోకి,మార్మిక సందేశాలిస్తూ ఒక్కొక్క మెట్టుగా నన్ను ఎక్కిస్తూ సౌందర్య సామ్రాజ్య మహారాణిని చేశాయి. అక్కడే కూర్చుని 'దిగిరాను దిగిరాను దివినుండి భువికి' అని కృష్ణ శాస్త్రి గారి పాట పాడుకున్నానుగాని దిగిరాక తప్పలేదు. మూలాల్ని వెదుకుతున్నపుడు నేల గుండెలోకి చొచ్చుకుపోయిన పూతీగె వేళ్ళను, మట్టిని, శ్రమించే కరకు బారిన చేతుల్ని నాకు చూపించింది ఆ పువ్వులే. అందం పచ్చగా పదికాలాలుండాలంటే. గుండెలో కరుణ వృష్టి కురియాలనే చెప్పింది పువ్వులే.

రంగులు మార్చిన ఆకాశంలో నక్షత్రాలు ఒక్కటొక్కటిగా విచ్చుతున్నాయి. చల్లగాలి మరింత పుంజుకుంది. పూలమ్ముకునే 'బీబీ' విరజాజి మాలల్ని గుట్టలుగా, రాసులుగా వ్రేలాడదీసింది తీగెలకు. సాయంత్రంనుండి రాత్రి పొద్దుపోయేవరకూ పూల ప్రేమికుల కోసం ఆశగా ఎదురుచూస్తుంది. దారాలతో బంధించి పెట్టిన పూలు దారిన పోతున్న మానవీయంత్రాల్ని ఒక్క నిముషం పాటు గుండె నిండుగా గాలి పీల్చుకునేలా చేస్తున్నాయి.

రోజూ చూసే దృశ్యమే అయినా ఎప్పటికప్పుడు నాలోకి జీవశక్తిని సరఫరా చేస్తూ జీవితాన్ని ప్రేమించేలా చేస్తుంది.

'ఇదేం పిచ్చో ఒక్కమూర చాలదుట దీని పిలకజడలోకి. బుట్టెడు పూలు ఏం చేసుకుంటావు?' అమ్మ కసరడం చిన్నప్పటి జ్ఞాపకం. ఆ కోరిక తనతోపాటే మధురంగా, వయ్యారంగా శరీరంలోని అందమైన వంపు సొంపులతో కలబోసి ఎదిగింది.

మల్లె, జాజిపూల కాలంలోనే పెళ్ళి చేసుకుంటాను. కాస్తసిగ్గేసినా అమ్మతో చెప్పేశాను.

పెళ్ళయిన కొత్త రాత్రులు పూల సరంభం పూల మాటలు లేకుండానే గడచి పోతాయన్నది నాకు తెలిసొచ్చిన నిజం.

తనకు పూలతో స్నేహభాగ్యం కలుగజేద్దామని విఫలయత్నం చేశాను.

నీకు విరజాజులిష్టమా? సారీ. ఈ కాగడామల్లెలిచ్చాడు వాడు. వీటితో సర్దుకో.

అసలు పువ్వులెందుకు? అడిగాను.

మంచి వాసననిస్తాయి.

నేనింకేం చెప్పను?

పొద్దున్నకు నలిగివాడిపోయిన పూలు వ్యర్థమైన జీవితంలా.

మరెప్పుడు పూలు తెమ్మని కోరి వాటిని అవమానించలేకపోయాను. యవ్వనం, సౌందర్యం, ఆనందం కలనేతగా అల్లుకున్న ఆ వెన్నెల రాత్రి

అద్దెకు దిగిన ఇంట్లో అడక్కుండా ఇచ్చిన వరంలా జాజిపందిరి పెరట్లో. సినిమా పాటలు వింటూ కూర్చున్నాను.

'జురువలపు జడివాన కురిసెరా

జాజిలతమేను తడిసెరా.

లతలాగే నామనసు తడిసెరా

నీలమోహనా రా....రా....'

మితిమీరిన మోహపు పరిమళాలు కృష్ణశాస్త్రి గారి కలం గుండెలోంచి సుశీల గొంతులోకి జాలువారి వింటున్నవారిని వలపు జడివానలో ముంచెత్తుతున్న వేళ పూలు నవ్వుతూ నాకో రహస్యం చెప్పాయి. ఏమంటే

'మేం వికసించి పరిమళిస్తాం.

ఎవరికోసం, ఎవరి ఆహ్వానం కోసం

ఎదురుచూడం' అని. అప్పుడర్థమైంది నాకు ఇచ్చుకోవడంలోని మాధుర్యం.

బాగా చీకటి పడింది. బాల్కనీలో లైటువేసి, కళ్ళుమూసుకుని పడుకున్నమావారినుదిటి పైన చెయ్యివేశాను మెత్తగా.

నిద్రపోలేదా...?

తల అడ్డంగా వూపారు.

అతనొచ్చాడు. నేనాశించిందిమాత్రం... తీసుకురాలేదు' అన్నాను.

ఆయన నవ్వారు.

తరువాత ఛానల్స్‌మారుస్తూ టీవీలో లోకాభి రామాయణం చూశాకా. కొన్ని తెలుగు సీరియల్స్‌చూసి అలసిపోయేలా నవ్వుకున్నాకా ఆయనకు వేడిగా అన్నం ముద్దలు తినిపిస్తాను. రోజూవేసే మందులువేసి. నా కంచం తెచ్చుక్కూర్చుంటాను.

రాత్రి తొమ్మిది దాటుతుంది. అప్పుడొస్తాడతను పైకి చూడకుండానే ఇంట్లో కెళ్ళిపోతాడు. ఒక గంట సేపు ఆఇంట్లో లైట్లు వెలుగుతాయి. తరువాత అప్రియమైన నిజంలా చీకటి నిండిపోతుంది.

ఫోనుమ్రోగింది...

'భావనమ్మా!' సాయిగొంతు అవతలనించి.

వూ.... చెప్పు...

అయ్యకెలావుంది?....

ఎంత చదువుకున్నా ఇలా అమ్మ. అయ్యా మానవుగదరా? అన్నాను ఎప్పటిలానే.

సర్లేఅమ్మా! ముందు అయ్యకెలావుందో చెప్పు.

"..............."

ఏమన్నారమ్మా డాక్టరు?

అయ్యనడుస్తారా ఇదివరకులా?

అమ్మా చెన్నైకు తీసికెడదాం. నామాటను వాడిగొంతులోంచి బాధగుండెలోంచే పలుకుతోంది.

సరే నువ్వెలా వున్నావు? ఎప్పుడొస్తావు?

"అమ్మా! వుద్యోగం బాగుంది. నా దిగులంతా నీ గురించేనమ్మా. మిమ్మల్ని అలావదిలేసి ఇక్కడ నేనెలా సంతోషంగా..."

"ఇక్కడి డాక్టర్లు న్యూరో ప్రోబ్లెమ్ అంటున్నారు. నెమ్మదిగా మార్పువస్తుందంటారు.. ఆరునెలలు దాటింది. నా గొంతు వణికింది...."

"డాక్టర్ల మందులో కాదమ్మా... నీ ప్రేమలో వుంది ఆ మహత్తు."

"అయ్యకు తప్పక నయమౌతుంది' అన్నాడు సాయి.

నేను నేర్పిన మాటలు వాడు మళ్ళీ నాకే చెప్తున్నాడు.

'భావనా!'.... ఆయన పిలిచారు.

సాయి ఫోను చేశాడా?

అవునండీ... అన్నాను ప్రక్కనే కూర్చుని.

"ఏమంటాడు? అయ్యను అక్కడకు తీసికెడదాం. ఇక్కడకు తీసికెడదాం. నీ ఎకౌంటులో డబ్బువేశాను అంటాడు." అన్నారు.

"ఆయన భుజంలో తల దాచుకున్నాను.. నా చంపల తడి.

'భావనా! సాయి నీ మానస పుత్రుడు. వాడు తోడుంటే మనకెందుకు దిగులు?' చెయ్యెత్తి నాతల నిమిరారు.

పదేళ్ళ సాయి నా కళ్ళముందు.

ఆరోజు ఏమైనా సరే నా కోర్కె తీర్చుకోవాలనుకున్నాను. అబ్బ నా కళ్ళు చూపు జాజిపూల రాసుల్లో చిక్కుపడి వెనక్కు రావుకదా. ఆలోచనల్ని నిలిపేసే శక్తి ఏదో వాటికి వుంది. ఆ ముత్యాల హారాల్ని, ఆ వెన్నెల మూటల్ని ఎత్తుకుని ఎక్కడికో పారిపోవాలని...

ఇంటి ఖర్చుల బడ్జెట్ జాగ్రత్తగా ప్లాన్ చేసి కొంత డబ్బు నా సంతోసం కోసం కేటాయించాను.

"ఎంత?"

"మూర మూడు రూపాయలమ్మా."

"మొత్తం పూలెంత"

"ఏంటమ్మా?..." కాస్త ఆశ్చర్యంగా.

"ఈ పూలు మొత్తం ఎంత?"

"కొలిచి చెప్పాలమ్మా. సుమారు ఆరొందలు"

అప్పుడే చూశాను మొదటిసారి సాయిని నేను. యజమాని కొడుతున్న దెబ్బలు ఓర్చుకోలేక కూలబడ్డాడు. తిట్లు-తన్నులు తినడం. చూడడం అనేది మనుషులనబడేవారికి సాధ్యం కానట్టుగా వుంది.

ఏమిటి? ఎందుకు... కొడుతున్నారు పాపం అంత చిన్నవాణ్ణి?

ఆడికెవరూ లేరమ్మా. రాత్రి పగలు పని చేయించుకుని ఏదో దానికి తన్నుతూనే వుంటాడు ఆ యదవ... అన్నాడు పూలబ్బాయి.

క్రింద పడుకున్నవాడిని కాలితో గట్టిగా తన్నాడు.

హమ్మా!..... వాడు మూలిగాడు.

నాకు సహనం చచ్చిపోతుంది.


ఇంకో దెబ్బ వడిందా మర్యాద దక్కదు. టీ కొట్టు అతన్ని వారించాను. చుట్టూ జనం పెరిగారు.

"మరీ చంపేత్తావా? ఏంటి" ఎవరో నిలేశారు.

"పది లీటర్ల పాలు నేలపాలు చేశాడు. మీరిత్తారా ఆ డబ్బు?"

జనం కాస్త వెనక్కు తగ్గారు.

ఏమ్మా? నువ్విస్తావా ఆ



అఖిలభారత భాషా సాహిత్య సమ్మేళన్ (భోపాల్) శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం (కోఠి) హైదరాబాద్‌లో కళా ప్రపూర్ణ డా|| పోతుకూచి సాంబశివరావుగారిని సన్మానించే కె.వి. రమణాచారి, జస్టిస్ ఎం. వెంకటేశ్వర్‌రెడ్డి, తంగిరాల చక్రవర్తి, ఎస్. ప్రసాదరావు, డా|| ఎం.ఎల్. నరసింహారావు, హైకోర్టు న్యాయవాది ఆర్. దుర్గా ప్రసన్న, పి.వి. బ్రహ్మం తదితరులు

నష్టం? నన్నడుగుతున్నాడు.

అదే పొరపాటు నీ వల్ల జరిగితే నిన్నెవరు కొట్టాలి? అన్నాను ఆవేశంగా

"కబుర్లు కాదమ్మా! డబ్బు...."

నా చేతిలో డబ్బు వాడిమీదకు విసిరాను. వాడు కింద పడ్డ డబ్బు తీసి లెక్క చూసుకుంటున్నాడు.

"మరొక సారి వంటి మీద దెబ్బ పడిందా పోలీసు రిపోర్టిస్తాను"

ఎవరో వాడి చేత మంచి నీళ్ళు తాగించారు.

నేను నా పని అయినట్టు వెనక్కు తిరిగాను.

అమ్మా! పూలు మరిచి పోయారమ్మా .... పూలకొట్టబ్బాయి పిలిచాడు.

వద్దులే...

"ఇంటికొచ్చాక గాని ఆవేశం చల్లారలేదు. ఇది అంతటితో ఆగిపోలేదు. మరునాడు గుమ్మం ముందు కూర్చున్నవాడిని చూసి లోపలికి పిలిచి అన్నం పెట్టాను.

"అమ్మా! పనిచేసి పెడతాను చెప్పండి.... ఆయన నన్ను పనిలోంచి తీసేశాడమ్మా...."

ఆ రోజు నుండి నన్ను వాడు వాడిని నేను వదలలేదు. మొదట్లో మా వారు కొంత విముఖత చూపించినా... సర్దుకుపోయారు. వాడు నన్ను భావనమ్మా అని పిలిచాడు. నేను వాడికి 'సాయి' అని పేరు పెట్టాను. ఒకరోజు వాడు చదువుకుంటా నన్నాడు. అలా వాడి చదువు ఎక్కడా ఆగకుండా డిగ్రీ దాకా వచ్చింది. ఆ తరువాత కూడా నన్ను డబ్బు అడగకుండా చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ పై చదువులకెళ్ళాడు. వాడెప్పుడొచ్చినా నా కోసం జాజిపూలు తేవడం మరచిపోడు. వాడు ఉద్యోగస్తుడైన రోజు మా వారి పాదాలకు నమస్కరిస్తుంటే... నా కళ్ళనిండా గుండెలనిండా పూల గుత్తులే... పరిమళాలు గుప్పుమని గుబాళించాయి.

సాయంత్రం అతనొచ్చేవేళౌతోంది.

చేతిలో జాజిపూలు దండలతో.... అతని రాకకోసం ఎదురు చూస్తూ. స్కూటరు ఆగింది.

నేను వడివడిగా మెట్లు దిగి వెళ్ళాను.

ఎప్పటిలా స్కూటరు బేగ్‌లోంచి ఏవో వస్తువులు తీస్తున్నాడు.

నన్ను చూసి రవంత ఆశ్చర్యం కళ్ళలో

మీరు కొత్తగా ఈ ఇంట్లోకొచ్చారని తెలుసు.

ఇవి.. ఈ జాజి పూలు మీ భార్య....

"సునంద" అన్నాడు చిరునవ్వుతో....

ఆమెకు నా కానుకగా ఇవ్వండి.... ప్లీజ్.... అభ్యర్ధన.

'థ్యాంక్యూ వెరీమచ్'...

చిన్న నవ్వు బదులిచ్చి వెనక్కి వచ్చాను.

మరునాడు మళ్ళీ సాయి నుంచి ఫోను వచ్చింది.

''భావనమ్మా! నేను చెన్నైనుండి మాట్లాడుతున్నానమ్మా అయ్య స్కేన్ రిపోర్టులు. టెస్టుల రిపోర్టులన్నీ ఇక్కడ న్యూరో సర్జన్ చూశారమ్మా.

ఆపరేషన్ చేస్తే అయ్య తప్పక నడుస్తారని చెప్తున్నారు.

వచ్చేనెల పదిహేనుకు అప్పాయింటుమెంటు ఇచ్చారమ్మా. నీకు అయ్యకూ టికెట్లు రిజర్వు చేయించాను వాడికింకేదో చెప్పి ఫోను పెట్టాడు.

నాకు గాల్లో తేలిపోతున్నట్టుంది. సాయి నాకు దేవుడిచ్చిన కొడుకు. ఈ సంతోషాన్ని ఎవరికి పంచాలి?

ఆయనకు అప్పుడే నిద్ర పట్టింది కాబోలు ప్రశాంతంగా పడుకొని వున్నారు.

పూల పరిమళం నన్ను బాల్కనీలోకి పిలిచింది. సమయం అయిదు దాటింది. స్కూటరు ఆగింది. స్కూటర్ బేగ్‌లోంచి తామరాకులో చుట్టివున్న జాజిపూల దండలు తీసి తలపైకెత్తి నాకేసి చూసి చిన్న నవ్వు నవ్వాడతను.... అతను ఇంట్లోకి వెళ్ళాడు. క్రింద రాలిపడ్డ జాజి పూలను చూస్తు న్నాను. జీవితం ఒక్కొక్క రేకగా విచ్చు కుంటోంది. విచ్చుకుంటున్న ప్రతీ దశనూ ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ. అరవిచ్చిన పరిమళ భరిత జీవిత కుసుమాన్ని స్వాగతించి. రెండు చేతులతో ఆర్తిగా అందుకుని బ్రతుకు ధన్యం చేసుకుంటున్నావా? పూలు మాట్లాడుతున్నాయి.

అరగంట దాటాకా అతను బయటకొచ్చాడు. వెనకే సునంద తలలో జాజిదండలు తురుముకుంది.

ఇద్దరూ నా వేపు చూస్తూ నవ్వుతూ చేయి వూపారు. బుదులు పలికాను. జంట కనుమరుగయే వరకూ... చూస్తూ పూలను ఆస్వాదించడమూ. జీవితాన్ని ఆహ్వానించడమూ ఒక్కటేనని ఇప్పుడిప్పుడే తెలిసింది

దేనికోసం బతకటం

పూలనడిగి తెలుసుకో. కవి ఇస్మాయిల్ పూలను చూసినప్పుడల్లా.

కవిత

# సోహం కోహం దాసోహం

శ్రీహస్త

అతడు వేలికొసలపై
ప్రపంచాన్ని నిలబెడతాడు
వెబ్‌కన్నుతో
లోకాన్నంతటినీ చూస్తాడు
వాయిస్ మెయిల్‌లో సందేశాలు వింటాడు
అంతరంగ భావాలు మాత్రం వినడు
చర్మచక్షువులు
మనోచక్షువులు
ఉపయోగించడు
మదికి మదికి మధ్య
గోడ కట్టుకొని
గవాక్షాలు మూసివుంచుతాడు
మనసునావిష్కరించడు
మస్తిష్కాన్ని ఉపయోగించడు
ఎప్పుడూ తననితాను నమ్మడు
తన ఎదుటవున్న కంప్యూటర్‌ని తప్ప
అందుకే అతడు
తనచుట్టూ సంకెళ్ల గూడు కట్టుకున్న
www.com
సారీ అతని పేరు కదూ అడిగారు
పాపం ఎప్పుడో మరిచిపోయాడు
అందుకే మనకి చెప్పలేకపోయాడు